క్లుప్తంగా

సుబ్బారాయుడి కానుకల ఆదాయం రూ.10.66 లక్షలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 101 రోజులకు గాను రూ.10,66,971 నగదు, 450 గ్రాముల వెండి కానుకల రూపేణా వచ్చినట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ ఆలయ ఈవో కె.శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం

శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం కృష్ణాజిల్లా పోరంకికి చెందిన నాగబోయిన దుర్గా ఫణిరాజ్ నాథ్,చిన్మయి రూ.11,116 విరాళాన్ని సహాయ కమిషనర్ జి.గంగాశ్రీదేవికి అందజేశారు.

భర్త కనపడటం లేదని ఫిర్యాదు

గుడివాడరూరల్: భర్త కనపడటం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడివాడ రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైపాస్‌రోడ్డులోని గణేష్ క్రూజ్ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న బేర వీరబాబు(40) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య కావ్యశ్రీ పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదరన్ స్లాట్‌లు ప్రారంభం

మొవ్వ: దివ్యాంగుల పెన్షన్ కోసం అవసరమైన సదరన్ స్లాట్‌లు బుధవారం నుంచి ప్రారంభమైనట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. వినికిడి లోపం, పక్షవాతం, మెంటల్లీ డిజేబుల్, అంధత్వ పెన్షన్‌ల కోసం వైద్య నిపుణులు అందచేసే ధ్రువీకరణ పత్రాలకు సచివాలయాల్లో లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తోట్లవల్లూరు: మండలంలోని భద్రిరాజుపాలెంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.అర్జునరాజు తెలిపారు. ట్రాక్టర్ యజమాని కాగిత శివ శ్రీనివాసరావు, డ్రైవర్ నందిబోయిన సత్యన్నారాయణను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వృద్ధులకు అన్నసమారాధన

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బేతవోలు లోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్న సమారాధన నిర్వహించారు. నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్లు సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు.

మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 210 దరఖాస్తులు

మొవ్వ: మద్యం దుకాణాల గడువు 9వ తేదీ సాయంత్రంతో ముగియనున్న తరుణంలో గడువు రెండు రోజులు పెంచటంతో 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు టెండర్లు దాఖలు చేసుకోవచ్చునని మొవ్వ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బి.వరాల రాజు బుధవారం తెలిపారు. మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొవ్వ మండలంలోని 4 దుకాణాలకు, ఘంటసాల మండలంలో 3 దుకాణాలకు , చల్లపల్లి మండలంలో 4 దుకాణాలకు గాను బుధవారం సాయంత్రానికి 210 దరఖాస్తులు అందినట్లు సీఐ తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు టెండరుదారుల సమక్షంలో మచిలీపట్నంలో డ్రా తీయనున్నట్లు సీఐ తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని గుడివాడ రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు వాహనదారులను కోరారు. మండలంలోని లింగవరం రోడ్డులో గుడివాడ-పోలుకొండ రహదారిపై బుధవారం సాయంత్రం హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

కొండలమ్మ తొలి మేనేజర్ ధర్మారాయుడికి సన్మానం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ తొలి మేనేజర్ జక్కా ధర్మారాయుడు దంపతులను ఈఓ ఆకుల కొండలరావు బుధవారం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

వీఆర్వో నాంచారయ్య ఆకస్మిక మృతి

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలికి చెందిన వీఆర్వో చిటికెల నాగనాంచారయ్య (48) బుధవారం ఉదయం మృతి చెందారు. నాంచారయ్య గతంలో వడాలి వీఆర్ఏగా పని చేసి ఉద్యోగోన్నతిపై బంటుమిల్లి మండలం కంచడం వీఆర్వోగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాంచారయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాంచారయ్య కుమార్తె వివాహం ఈ నెల 17న జరగాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో నాంచారయ్య మరణం కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. మండలంలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు నాంచారయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

అభివృద్ధికి నోచుకోని డొంకరోడ్లు



అధ్వానంగా ఉన్న గుర్రాల్లంక డొంకరోడ్డు



పాడైపోయిన కపిలేశ్వరపురం డొంకరోడ్డు

పమిడిముక్కల: మండల పరిధిలోని డొంకరోడ్లు ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీటిలో అత్యధికం మట్టిరోడ్లు కాగా అక్కడక్కడ కొన్ని రబ్బీష్ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లన్నీ పూర్తిగా పాడైపోయి, గుంతలమయంగా మారి ఉన్నాయి. వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా లేదు. వర్షం పడితే నడిచి వెళ్లడం కూడా కష్టమే. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, కూలీలు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండిన పంటను ఇంటికి తీసుకువచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఉయ్యూరు సీడీసీ నుంచి డొంక రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించేవారు. ఈ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేసుకుని పంటలను ఇంటికి చేర్చుకునేవారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ, సీడీసీ నుంచి నిధుల కేటాయింపు జరగడం లేదు. దీంతో డొంకరోడ్ల అభివృద్ధి ఆగిపోయింది. రైతులు తలో కొంత వేసుకుని బాగు చేసుకుంటే తప్ప డొంకరోడ్లను పట్టించుకొనే పరిస్థితి లేదు. డొంకరోడ్లను అభివృద్ధి చేసి తమ అవస్థలు తొలగించాలని రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డొంకరోడ్లకు నిధులు మంజూరు చేయాలి



డొంకరోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పొలాలకు వెళ్లాలంటే నానా పాట్లు పడాల్సివస్తోంది. డొంకరోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– బి.బాబూరావు, రైతు, అగినపర్రు

పంట ఇంటికి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది



డొంకరోడ్లు బురద బురదగా ఉంటున్నాయి. నడిచి వెళ్లేందుకు కూడా వీలుగా లేవు. పంట ఇంటికి తెచ్చుకోవడం కష్టంగా ఉంది. డొంకరోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.

– కె.వెంకటేశ్వరరావు, రైతు, లంకపల్లి

డొంక రోడ్లలో వెళ్లాలంటే నరకమే

పెదపారుపూడి: మండలంలోని చాలా గ్రామాల్లో పొలాల్లోకి వెళ్లే డొంక రోడ్లు అన్నీ అధ్వానంగా ఉండటంతో రైతులు నరకం చూస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ గుంతలు పడి నడవటానికి కష్టంగా ఉన్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి పాలకోడు డ్రెయిన్ పక్క నుంచి వెళ్లే డొంక రోడ్డు అంతా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వానపాముల, వెంట్రప్రగడ పొలిమేర ఉన్న డొంక అంతా బురదకొయ్యగా మారిందని రైతులు అంటున్నారు. ఈదులమద్దాలి నుంచి జువ్వనపూడి మధ్యలో ఉన్న డొంక రోడ్డుపై నడవలంటే చాలా ఇబ్బందిగా ఉంటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదపారుపూడి గుర్విందగుంట మధ్య ఉన్న డొంక రోడ్డు అంతా చిన్నపాటి వర్షానికే బురదగా మారటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పొలాల్లోకి వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది



పాలకోడు డ్రెయిన్ పక్కన ఉన్న డొంక అంతా గుంతలు పడి పొలాల్లోకి వెళ్లలంటే నరకం కనిపిస్తోంది. వర్షం వస్తే ఇక చెప్పనలవి కాదు. పొలాల్లో జల్లటానికి ఎరువులు తీసుకుని వెళ్లాలంటే నానా యాతన పడుతున్నాం.

– పొనుగుమాటి సువర్ణరాజు, కౌలు రైతు, పెదపారుపూడి



పెదపారుపూడిలో గుంతలమయంగా మారిన డొంక రోడ్డు

నేడు దుర్గాష్టమికి భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో గురువారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దుర్గాష్టమికి భారీ ఏర్పాట్లను చేపట్టారు. బుధవారం సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు, ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, ఆలయ ఈఓ ఆకుల కొండలరావు దుర్గాష్టమి ఊరేగింపు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వేలాది మంది భక్తులకు నిర్వహించే భారీ అన్నసమారాధన పనులను తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి చిత్తర్వు పరామర్శ



గుడ్లవల్లేరు: కొతవరం వైఎస్సార్ సీపీ నేత వడ్లమూడి నాగమోహన్(చిన్ని) ఇటీవల మృతి చెందారు. చిన్ని సోదరుడు వడ్లమూడి శ్రీనివాస్ మూర్తి, కుమారులు జయరామ్, శ్రీరామ్‌ను బుధవారం ఆ పార్టీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు తాళ్లూరి మాధవ్, పార్టీ నేత నిరీక్షణరావు తదితరులు ఉన్నారు.

వీణాపాణికి భక్తజన నీరాజనం

- వేలాదిమంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం
- భీమేశ్వరాలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడటౌన్: భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీసరస్వతిదేవిగా...



గుడివాడరూరల్: అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రీసరస్వతిదేవిగా...



ముదినేపల్లిరూరల్: సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి ఆలయంలో...



తోట్లవల్లూరు: గరికపర్రులో భక్తులతో పూజలందుకున్న అంకమ్మతల్లి



పామర్రు: సరస్వతీ మాతగా అలంకరించిన పర్వత వర్ధనీ దేవి



తోట్లవల్లూరు: శివాలయంలో శ్రీసరస్వతిదేవిగా అమ్మవారు



మొవ్వ: పెదపూడిలో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



నందివాడ: లక్ష్మీనరసింహపురంలో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని ఆలయాలలో బుధవారం అమ్మవార్లను శ్రీ సరస్వతీదేవిగా అలంకరించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సరస్వతీ దేవి పూజలో పాల్గొని అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించారు. భీమేశ్వరాలయంలో, కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో, శంకర మందిరంలో, విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో చిన్నారులతో పూజలు నిర్వహించారు.

అష్టలక్ష్మీ ఆలయంలో...

గుడివాడరూరల్: తటివర్రు రోడ్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. రాత్రి రమ్యారెడ్డి బృందం సభ్యులు నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చినఎరుకపాడు శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రులో...

పామర్రు: స్థానిక కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

మామిళ్లపల్లిలో...

పమిడిముక్కల: జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో మామిళ్లపల్లి సరస్వతీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాతా సుజ్ఞానందగిరి అమ్మవారు చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు.

సింగరాయపాలెంలో...

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవీగా అలంకరించి పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. మండలంలోని దేవపూడి, గురజ, పెదకామనపూడి, పెయ్యేరు, బొమ్మినంపాడు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అంకమ్మతల్లికి సారె సమర్పణ

తోట్లవల్లూరు: గరికపర్రులోని అంకమ్మతల్లికి దసరా సారె సమర్పణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో నివశిస్తున్న వీరంకి వారి ఆడపడుచులు పెద్ద ఎత్తున మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో తరలివచ్చి అంకమ్మ తల్లికి సారె సమర్పించారు. పూజలు జరిపి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. తోట్లవల్లూరులోని భ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం శ్రీసరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్య సుధాకర్, మనోరమ దంపతులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపారు.

శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ...



సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



దోకిపర్రులో సరస్వతీ దేవిగా అమ్మవారు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ వివిధ పూజలు, విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. విద్యార్థులు భారీసంఖ్యలో విచ్చేసి అమ్మవారికి సామూహిక పూజలను చేశారు. విద్యార్థులకు ఈఓ కొండలరావు నోట్ బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): పెదపూడి యూనియన్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన పందిర్లో బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దేవదాయ ధర్మదాయ శాఖ ఈఓ టి.మోహనరావు దంపతులు పాల్గొన్నారు.

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు బుధవారం సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సుమారు 60 మంది విద్యార్థులతో ఆలయ అర్చకుడు మామిళ్ళపల్లి చితాంబరం చిన్నారులతో కుంకుమ పూజలు చేయించారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

కైకలూరులో...

కైకలూరు: కైకలూరు షిరిడి సాయిబాబా మందిరంలో కృష్ణావతారాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, సత్యసాయి మందిరంలో నిర్వహించిన దసరా మహోత్సవాల్లో పాల్గొన్నారు. కై కలూరు శ్యామలాంబ తల్లి సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిదిండి మండలంలో...

కలిదిండి మండలం గొల్లగూడెంలో దుర్గా మల్లేశ్వరి అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. లోకుమూడి దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన జరిగింది. గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో 500 చిన్నారులు పూజలు చేశారు. ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో అమ్మవారు సరస్వతీ మాత అలంకరణలో దర్శనమిచ్చారు. కై కలూరు వైఎస్సార్ కాలనీ (కరకట్ట)లో విజయదుర్గ మాతకు 130 మంది చిన్నారులతో పూజ చేయించారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

నందివాడ మండలంలో...

నందివాడ: నందివాడ మండలం లక్ష్మీనరసింహాపురంలో అమ్మవారు సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండవల్లిలో...

మండవల్లి: మండలంలోని లోకుమూడి గరువు గంగానమ్మ ఆలయంలో, దుర్గామాత ఆలయంలో, శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు.



గుడివాడ: కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..



పమిడిముక్కల: మామిళ్లపల్లి ఆలయంలో...



పామర్రు: జమీదగ్గుమిల్లి సరస్వతీ ఆలయంలో...



పెదపారుపూడి: వానపాముల ఆలయంలో..



గుడివాడ: భీమేశ్వర స్వామి ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



కైకలూరు: షిర్డి సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



పామర్రు: కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా